

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 05-09-2025 | సంపుటి - 24 | సంచిక - 117 | రూ : 4 | పేజీలు:




2లో

# తగ్గుతున్న కొత్తతరం!

- దేశంలో 0-14 ఏళ్ల జనాభాలో క్షీణత నమోదు
- 15-59 వయసున్న వారి సంఖ్యలో భారీ పెరుగుదల
- 2 కన్నా దిగువకు సంతానోత్పత్తి నిష్పత్తి
- తెలుగు రాష్ట్రాల్లో ఇది 1.5కే పరిమితం
- ఎస్‌ఆర్‌ఎస్ నివేదిక-2023 వెల్లడి

దిల్లీ, హైదరాబాద్ : ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రస్ఫుటమవుతోన్న జనాభావృద్ధి తిరోగమనం భారత్‌లోనూ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. యువ జనాభాలో అగ్రస్థానంలో ఉన్న మన దేశంలోనూ వీరి సంఖ్య తగ్గిపోతూ వయోధికులు అధికమవుతుండడంతో భవిష్యత్తు పరిణామాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో సంతానోత్పత్తి నిష్పత్తి 1.9కి తగ్గిపోవడమే అందుకు కారణమని కేంద్ర జన గణన విభాగం తాజాగా విడుదల చేసిన శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టం(ఎస్‌ఆర్‌ఎస్) నివేదిక 2023 వెల్లడించింది. దేశంలో సంతానోత్పత్తి నిష్పత్తి (టీఎఫ్‌ఆర్)

తరువాయి 2లో

ఇంటి నిర్మాణ దశ అప్‌లోడ్..

## లబ్ధిదారుడి చేతుల్లోనే

ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో కొత్త ఆప్షన్ ఏర్పాటు

బిల్లుల ఆలస్యం, సిబ్బంది చేతివాటానికి ముగింపు



2లో

## సింగరేణికి నాలుగు ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు

సీఎండీ బలరాంకు ప్రదానం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

2లో

రాయదుర్గంలో

## భారీ ధర పలికిన గణేశ్ లడ్డూ



ప్రతీకాత్మక చిత్రం

2లో

- మైహోమ్ భుజాలో వేలంలో రికార్డు ధర పలికిన లడ్డూ ప్రసాదం
- రూ. 51,77,777కు దక్కించుకున్న ఇల్లందుకు చెందిన గణేశ్
- గత ఏడాది రూ. 29 లక్షలకు లడ్డూను దక్కించుకున్న గణేశ్



2లో

## ఈ నెల 7న ఆకాశంలో అద్భుతం

సంపూర్ణ చంద్రగ్రహణం

- ఈ దశాబ్దంలోనే అత్యంత ప్రకాశవంతమైన గ్రహణం
- రాత్రి 8:58 గంటలకు గ్రహణం ప్రారంభం
- రాత్రి 11 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం
- తెల్లవారుజామున 2:25 నిమిషాలకు పూర్తి

## మా బంధం దౌత్యానికి మించినది

సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు



2లో

- ఏఐ, గ్రీన్ షిప్పింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో సహకారం
- చెన్నైలో సింగపూర్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం
- వాణిజ్య ఒప్పందాల సమీక్షకు ఇరు దేశాల నిర్ణయం
- యూపీఐ-పేనౌ అనుసంధానంలో చేరిన మరో 13 భారత బ్యాంకులు

## కవితపై తెలంగాణ జాగృతి నేత రాజారాం యాదవ్ తీవ్ర ఆగ్రహం



2లో

## కామారెడ్డిలో ఏరియల్ సర్వే చేసిన ముఖ్యమంత్రి

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష
- మరమ్మతులు, నిర్మాణాలు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలన్న సీఎం



2లో

# చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయం.. ఇకపై రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం!

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆరోగ్య భద్రత దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'కి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఆయుష్మాన్ భారత్ ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం కింద ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని అర్హులైన సుమారు కోటి 63 లక్షల కుటుంబాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలు కాకుండా చూసేందుకు ఈ పథకం దోహదపడనుంది. ఈ పథకం అమలులో వేగం, పారదర్శకతకు



ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. వైద్య చికిత్సలకు కేవలం 6 గంటల్లోనే అనుమతులు మంజూరు చేసేలా ప్రత్యేకంగా 'ప్రీ ఆథరైజేషన్ మేనేజ్‌మెంట్' వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. హైబ్రిడ్ విధానంలో మొత్తం 3,257 రకాల చికిత్సలను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ పాలసీ ప్రకారం, రూ. 2.5 లక్షల లోపు వైద్య చికిత్సల క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలు పర్యవేక్షిస్తాయి. రూ. 2.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు అయ్యే భారీ వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో మంత్రులతో చర్చించిన అనంతరం సీఎం చంద్రబాబు ఈ కీలక నిర్ణయాలకు ఆమోదం

## రాయదుర్గంలో రూ. 51 లక్షలు పలికిన గణేశుడి లడ్డూ

**హైదరాబాద్, సెప్టెంబర్ 04 :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గణేశుడు అంటే ఖైరతాబాద్, గణేశుడి లడ్డూ అంటే బాలాపూర్ గణేశ్ లడ్డూ గుర్తుకు వస్తుంది. లడ్డూకు అత్యధిక ధర పలకడంలో కొన్నేళ్ల క్రితం వరకు బాలాపూర్ గణేశుడి పేరు మారుమోగింది. గత కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల్లోనూ లడ్డూ ప్రసాదం రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. తాజాగా, రాయదుర్గంలో గణేశుడి లడ్డూ ఏకంగా రూ. 51 లక్షలు పలికింది. రాయదుర్గంలోని మైహోమ్ భుజాలో గణేశు లడ్డూను ఇల్లందుకు చెందిన గణేశ్ అనే వ్యక్తి రూ. 51,77,777కు దక్కించుకున్నారు. గత ఏడాది ఇక్కడ లడ్డూ ధర రూ. 29 లక్షలు పలికింది. అప్పుడు కూడా ఈ లడ్డూను వేలంలో ఆయనే సొంతం చేసుకున్నారు.

## కామారెడ్డిలో ఏరియల్ సర్వే చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

* **వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే**
* **వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష**
* **మరమ్మతులు, నిర్మాణాలు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలన్న సీఎం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 04 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆయన వెంట టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయడంతో పాటు బాధితులతో ఆయన మాట్లాడారు. వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వరదల కారణంగా ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు, నిర్మాణాలు తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే వరద నష్టాలను తగ్గించగలమని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరికి వారు ఉంటామంటే క్రైసిస్ మేనేజ్‌మెంట్ చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో సమన్వయం లోపం వల్లే సమస్యలు వస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. యూరియా పంపిణీలో ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి గందరగోళం లేకుండా చూడాలని సూచించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమస్యలపై 15 రోజుల తర్వాత మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఈ నెల 7న ఆకాశంలో అద్భుతం.. సంపూర్ణ చంద్రగ్రహణం

**హైదరాబాద్, సెప్టెంబర్ 04 :** ఈ నెల 7వ తేదీన ఆకాశంలో అద్భుతం చోటుచేసుకోనుంది. గడిచిన దశాబ్ద కాలంలోనే అత్యంత ప్రకాశవంతమైన చంద్రగ్రహణం ఏర్పడనుంది. రాత్రి 8:58 గంటలకు మొదలై 11 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడి, తెల్లవారుజామున 2:25 గంటలకు గ్రహణం విడవనుంది. నార్త్, సౌత్ అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో మినహా మిగతా దేశాల ప్రజలు నేరుగా గ్రహణాన్ని చూడొచ్చని పరిశోధకులు వెల్లడించారు. ఆకాశం మేఘావృతమై ఉండకపోతే కనుక, డాబాపైకి ఎక్కి ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చని చెప్పారు. టెలీస్కోప్ కానీ, బైనాక్యులర్ కానీ అందుబాటులో ఉంటే గ్రహణాన్ని మరింత చక్కగా చూడవచ్చని తెలిపారు. రాత్రి 11 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందని వివరించారు.

## మా బంధం దౌత్యానికి మించినది : సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 04 :** భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో (CECA) పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

# తగ్గుతున్న కొత్తతరం!

(మొదటిపేజీ తరువాయి)

2.0 కన్నా దిగువున నమోదవడం ఇదే తొలిసారి. టీఎఫ్ఆర్ ఈ స్థాయిలో పడిపోతే అది జనాభా తగ్గుదలకు దారితీస్తుంది. సమాజం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**బిహార్‌లో అత్యధికం..**

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి నిష్పత్తి 2.1 కాగా పట్టణ ప్రాంతాల్లో 1.5కే పరిమితమైంది. ప్రస్తుతం టీఎఫ్ఆర్ అత్యధికంగా బిహార్‌లో 2.8గా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (2.6), మధ్యప్రదేశ్ (2.4), రాజస్థాన్ (2.3), ఛత్తీస్‌గఢ్ (2.2), ఝార్ఖండ్ (2.1), అస్సాం (2.0) రాష్ట్రాలు ఉన్నాయి. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో సంతానోత్పత్తి నిష్పత్తి 2.0 లోపునకు పడిపోయింది. దిల్లీలో ఇది అత్యల్పంగా 1.2గా నమోదైంది. ఇదే వరుసలో తమిళనాడు, పశ్చిమబెంగాల్ (1.3), మహారాష్ట్ర (1.4), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూకశ్మీర్, కర్ణాటక, కేరళ (1.5) ఉన్నాయి.

* 2011..13తో పోలిస్తే 202123 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా టీఎఫ్ఆర్ సగటున 16.7% క్షీణించింది.
* 1985లో దేశంలో టీఎఫ్ఆర్ 4.3% కాగా ఇప్పుడు అది 1.9%కి పడిపోయింది.
* ప్రస్తుత నివేదిక ప్రకారం జాతీయ సగటుతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో యుక్తవయస్సు వారు తక్కువగా, వయోజనులు ఎక్కువగా ఉన్నారు. ఈ రెండు గ్రూపుల వయస్సు మధ్య అంతరం భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం ఉంది.

**ఆందోళన ఎందుకంటే...**

* సంతానోత్పత్తి తగ్గిపోవడం వల్ల దేశంలో యుక్తవయస్సు వారి సంఖ్య క్షీణించి వయోధికుల సంఖ్య పెరుగుతూపోతుంది.
* యువత తగ్గిపోవడం వల్ల ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఉత్పాదకత తగ్గి ఆర్థికవృద్ధి నెమ్మదిస్తుంది. శ్రామిక విపణిలోకి యుక్తవయస్సు వారు రావడం తగ్గిపోతే దాని పరిణామాలు వెంటనే కనిపిస్తాయి.
* వయోధికుల సంఖ్య పెరగడంవల్ల పింఛను, ఆరోగ్య, సంక్షేమరంగాలపై ఒత్తిడిపెరుగుతుంది.
* కొన్ని దేశాలు జనాభా తిరోగమన దశలోకి వెళ్లిపోవడంతో అక్కడ ఆర్థిక మందగమనం కనిపిస్తోంది.

## ఇంటి నిర్మాణ దశ అప్‌లోడ్.. లబ్ధిదారుడి చేతుల్లోనే

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ డబ్బులు జమ చేయడంలో ఆలస్యం కాకుండా, అధికారుల చేతివాటానికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల కోసం రాష్ట్ర గృహనిర్మాణశాఖ మొబైల్ యాప్‌లో కొత్త ఆప్షన్(ఫొటో క్యాప్చర్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటి నిర్మాణం ముగ్గు, పునాది, గోడలు, శ్లాబ్ వంటి దశల్లో ఉన్నప్పుడు అధికారులు, సిబ్బంది ఫొటోలు తీసి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తేనే లబ్ధిదారులకు నిర్మాణానికి సంబంధించి నిధులు జమ అయ్యేవి. అయితే, ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఇంటి నిర్మాణ దశను యాప్‌లో నమోదు చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్న ఉదంతాలు బయటకు వస్తున్నాయి. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకుని హౌసింగ్‌శాఖ ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో ఫొటో క్యాప్చర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా లబ్ధిదారులే నేరుగా తమ ఇంటి నిర్మాణ దశను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు. అధికారులు గురువారం ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

**యాప్‌లో అప్‌లోడ్ ఇలా..**

మొదట ఇందిరమ్మ ఇళ్లు అనే మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో బెనిఫిషియరీ లాగిన్‌కు వెళ్లాలి. అక్కడ డాష్ బోర్డులోకి వెళ్లి లబ్ధిదారుడి పేరు, మొబైల్ నంబరు, గ్రామం నమోదు చేయాలి. అనంతరం ఫొటో క్యాప్చర్ ఆప్షన్ వస్తుంది. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో అడుగుతుంది. ఆ వివరాలను నమోదు చేయాలి.

అనంతరం ఆ దశకు సంబంధించిన ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఇంటి నిర్మాణ విస్తీర్ణ వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

తర్వాత ఇంటికి సంబంధించిన జియో కోఆర్డినేట్ వివరాలను చూపుతుంది. వీటికి సంబంధించిన చిత్రాలు యాప్‌లో ఉంటాయి. యాప్‌లో అడిగే ప్రశ్నలకు అవును/కాదు అని సమాధానం చెప్పాలి. తర్వాత ఇంటి నిర్మాణ దశ అప్‌లోడ్ అవుతుంది.

ఎవరైనా లబ్ధిదారుడు తప్పుడు ఫొటోలను అప్‌లోడ్ చేస్తే స్థానిక అధికారుల, సిబ్బంది విచారణలో బయటపడుతుంది.

త్వరలోనే లబ్ధిదారులకు ఈ యాప్‌నకు సంబంధించి అధికారులు అవగాహన కల్పించనున్నారు.

## తెలంగాణలో వరదలు జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**: అమిత్ షాను కోరిన భట్టి, తుమ్మల**



**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 04 :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన వర్షాలు, పంట నష్టం గురించి అమిత్ షాకు వివరించారు. ఆగస్టు 2528 మంది కురిసిన వర్షాలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణ, అత్యవసర మరమ్మతులకు నిధులు ఇవ్వాలని కోరారు. పంటలు, ప్రజల ఆస్తులు, రహదారులు, చెరువులకు జరిగిన నష్టంపై వివరణ ఇచ్చారు. దాదాపు రూ.5,018 కోట్ల విలువైన నష్టం జరిగిందని, రాష్ట్రానికి విపత్తు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం మంత్రిని కోరారు. గతేడాది సెప్టెంబర్‌లో వరదల వల్ల రూ.11,713 కోట్ల నష్టం జరిగితే.. రూ.416.80 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్రం మరిన్ని విపత్తు నిధులు ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## సింగరేణికి నాలుగు ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు

హైదరాబాద్, గోదావరిఖని : గత ఆర్థిక సంవత్సరానికి సింగరేణిలోని నాలుగు గనులకు జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు లభించాయి. ముంబయిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఈ అవార్డులను అందుకున్నారు. గనులలో రామగుండం3కు చెందిన ఆర్‌జీవోసీ1 ఎక్స్‌టెన్షన్, ఇల్లందుకు చెందిన జీకే5ఓసీకు, భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్‌కు చెందిన ఆర్కే6, ఆర్కే న్యూటెక్‌లు అవార్డులకు ఎంపికయ్యాయి. కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వశాఖ ప్రతి ఏటా అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్‌ను అందిస్తోంది. బొగ్గు గనుల పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం తదితర 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తుంది. మొత్తం 100 మార్కుల్లో 91 కంటే ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఈ రేటింగ్ అందిస్తారు. సింగరేణికి నాలుగు అవార్డులు రావడంపై సీఎండీ బలరాం హర్షం వ్యక్తం చేశారు. గనుల యాజమాన్యాలకు, కార్మికులకు అభినందనలు తెలిపారు.

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం

ఆదిలాబాద్; కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు ఎందుకు తినరంటూ హైకోర్టు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఈనాడు' బృందం గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించింది. అక్కడి ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు స్పష్టమైంది. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ సూచన మేరకు గత రెండు నెలల నుంచి రోజుకో ఉపాధ్యాయుడు భోజన తయారీని పర్యవేక్షిస్తున్నారు. మెనూ అమలయ్యేలా చూస్తున్నారు. విద్యార్థులతో పాటే కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.



# విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది గురువు

* **విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది గురువు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగులు నింపేది తమకు విద్యను నేర్పించే గురువు అని మండల విద్యాధికారి గురువారావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గురువారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక గురువు ఉంటాడన్నారు. విద్యార్థి జీవితానికి వెలుగు నింపే దీపం లాంటి వ్యక్తి గురువు అన్నారు. గురువులను గౌరవించాలని, వారు బోధించిన పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలను అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తమ తోటి విద్యార్థులకు తరగతులను నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం మండల విద్యాధికారి గురువారావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సతీష్, ఆర్ఐ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్వేతా బాన్స్, డీన్ దుర్గాప్రసాద్, ఏవో గోపీచంద్, ప్రైమరీ ఇన్చార్జ్ పరమేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## సీనియర్ ఎల్ఐసి ఏజెంట్ సిలివేరు వీరేశం కు ఘనంగా సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎల్ఐసి ఏజెంట్ గా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సిలివేరు వీరేశం 35సంవత్సరాలుగా ఎల్ఐసి ఏజెంట్ సర్వీసును పూర్తి చేసుకున్నారు. 2000మంది పాలసీదారులకు సేవలు అందిస్తున్నారు. ఎల్ఐసి సంస్థ ఏర్పడి 69సంవత్సరాలు పూర్తయింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు భీమా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ ఏజెంట్ గా ఉన్న వీరేశంను చౌటుప్పల్ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఇందులో ముఖ్య అతిథిగా చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు, చౌటుప్పల ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ హిమాన్షు, డెవలప్మెంట్ ఆఫీసర్లు అప్పారావు, రవికుమార్, శ్రీనివాస్, గంగాధర్, చక్రవర్తి, మహేష్, ఎల్ఐసి ఉద్యోగులు, ఎల్ఐసి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్లో ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు శ్రీదేవి టీం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు జయచంద్రిక, సీనియర్ నాయకులు నల్ల సంజీవ రెడ్డి లతోపాటు జిల్లా గణేష్ నేత లు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ రూబెన్, నాయకులు రవి, మనెమ్మ, రాజ్యలక్ష్మి, సౌందర్య,శ్రీను, స్వరూప, సాయి ,లాలన్, వెంకటకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి:కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో చెరుకుపల్లి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిషోర్ చారి, నాయకులు కిరణ్ యాదవ్ తో పాటు భక్తులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద కార్యక్రమం

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: వినాయక నవరాత్రి ఉత్సవాలను పునస్కరించుకొని ఇల్లందు పట్టణంలోని. అంబజార్ లో హమాలీ సంగమ్ , గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాపించిన వినాయకుడి మండపం వద్ద బుధవారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా కమిటీ సభ్యులు,గోపాల్ సేటు, నందు సేటు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు టిఆర్ఎస్ పార్టీ ఫౌండర్ మెంబర్ దిండిగల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బి ఆర్ఎస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి,భావు సింగ్ అన్న , నారపాక వసంత్,లలిత్ కుమార్ పాసి గడ్డి శీను, ఇమ్రాన్, మునిగంటి శివ పాలడుగు రాజశేఖర్, పరక పల్లి రవి కిషన్ లాల్ పాసి, నాగయ్య, శ్రీకాంత్, రాంలాల్ పాసి పాల్గొన్నారు.



## అందోల్ లో విద్యా ప్రగతికి పెద్దపీట ...

* **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోల్ నియోజకవర్గం లో విద్యా ప్రగతి పెద్ద పీఠ వేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం ఆందోల్, చౌటకూర్ మండలాల లోని పలు అభివృద్ధి , సంక్షేమ , ప్రభుత్వ విద్యాసంస్థలలో రూ. 31.24 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా తో మాట్లాడారు. ..రాష్టంలో అందోల్ నియోజకవర్గాన్ని విజ్ఞాన భాండాగారం గా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల విద్యాసంస్థలు రానున్న మూడు సంవత్సరాల్లో దశల వారీగా పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యాసంస్థల లో కావలసిన మౌలిక వసతుల కల్పన కు కృషి చేస్తున్నామన్నారు. గురువారం అందోల్, చౌటకూర్ మండలాలలో రూ. 31.24 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ లో కోట్లతో నిర్మించనున్న కేజీబీవీ పాఠశాల భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం సుల్తాన్పూర్ లో రూ .2.56కోట్ల తో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అందుల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ రెండు కోట్లతో నిర్మించనున్న స్వాగత తోరణం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అందంలోని మహిళా నర్సింగ్ కళాశాల మహిళా పాలిటెక్నిక్ కళాశాల కేజీబీవీ విద్యాసంస్థల వద్ద లక్షలతో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్ను మంత్రి ప్రారంభించారు. అందోల్ కేజీబీవీ రూ.2.20 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పేరెంట్స్ వెయిటింగ్ హాల్ టాయిలెట్ బ్లాక్ లను మంత్రి ప్రారంభించారు. ఆందోల్ లో రూ.5.75 కొట్లతో నిర్మించనున్న రెవెన్యూ డివిజనల్ నూతన కార్యాలయ నిర్మాణం పనులకు శంకు మంత్రి శంకుస్థాపన చేశారు . ప్రభుత్వ విద్యాసంస్థలు శానిటేషన్ కార్యక్రమాలలో మున్సిపల్ సిబ్బంది సహకారం తీసుకొని విద్యాసంస్థల్లో శానిటేషన్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సిబ్బందికి మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇళ్లను మంత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలకు గౌరవప్రదమైన వసతి కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సొంత ఇంటి కలలు నెరవేర్చేలా ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సాధించిందని తెలిపారు. కొత్త మోడల్ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ, లబ్ధిదారుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో కూడిన గృహాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆర్ డి ఓ పాండు స్థానిక ప్రజాప్రతినిధులు, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మార్క్ ఫెడ్ జగన్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, సురేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, ప్రదీప్ గౌడ్,పద్మనాభరెడ్డి మాజీ సర్పంచులు , మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ మండపం వద్ద ఘనంగా మహా అన్న ప్రసాద కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా స్థానిక ఇల్లందు మున్సిపాలిటీలో గల 15 వార్డు శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో 14 నెంబర్ బస్తి గణేష్ మండలి వద్ద తొమ్మిదవ రోజు మధ్యాహ్నం మహా అన్న ప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కమిటీ పెద్దలు కొప్పుల తిరుపతిరావు, కమిటీ సభ్యులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్, కేశవ్ లాల్ లోద్, వాసుదేవు లోద్, కిషోర్ లాల్, రాకేష్, పృధ్విరాజ్, కార్తీక్, కళ్యాణ్,యూత్ కాంగ్రెస్ లీడర్ సుమిత్ కోరి, నాగేందర్, రామ్ నివాస్, విష్ణు, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

## బొల్లి బుచ్చయ్య పార్థీవ దేహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలం రాఘబోయినగూడెం గ్రామ పంచాయితి కొత్తగుంపు గ్రామం కు చెందిన బొల్లి బుచ్చయ్య గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య వారి స్వగృహంకు వెళ్ళి ఆయన పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ఎంపిపి మండల రాము,సొసైటి డైరెక్టర్,మాజీ సర్పంచ్ కునుసోత్ రాము,బొల్లి రామారావం,భుక్యా శంకర్,దండుగుల శివ,బానోత్ శంకర్, తదితరులు ఉన్నారు.

## ఇల్లందులో యూరియా కోసం అఖిలపక్ష నాయకుల ధర్నా



ప్రజాస్ఫూర్తి ,ఇల్లందు: గత రెండు నెలలుగా యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇల్లెందు వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో వినతి పత్రాన్ని కార్యాలయ తలుపునకు అంటించారు. ధర్నాకు సారంగపాణి అధ్యక్షత వహించగా సీపీఐ ఎంఎల్ మాస్లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్ర అరుణ, ఎన్డీ పార్టీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బ్రహ్మచారి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, న్యూ డెమోక్రసీ ఇల్లెందు పట్టణ కార్యదర్శి ఎండీ రాసుద్దీన్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్సీ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12 ఛలో ప్రజా భవన్ కు కదిలి రావాలి

* **జేఏసీ నాయకుల పిలుపు.**
* **సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వద్ద విస్తృత ప్రచారం..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 36 వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12 న చలో ప్రజా భవన్ కు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారూ. జేఏసీ నాయకులు భూక్యా రమేష్, గుడెల్లి యాకయ్య మాట్లాడారు. గురువారం ఉదయం నుండి సాయంత్ర వరకు సింగరేణి ఏరియా , కార్పొరేట్ పని ప్రాంతాలలో కార్మికుల వద్ద విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. గత అనేక సంవత్సరాల నుండి



కల్లబొల్లి మాటలు చెబుతూ కాంటాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తున్న పద్ధతిని వ్యతిరేకిస్తూ కాంట్రాక్టు కార్మికులకు వెంటనే కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో ఉందని ప్రకటించిన సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న కాంట్రాక్టు కార్మికులకి ఈ లాభాల బోనస్ లో ప్రతి కార్మికుడికి 20,000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 22 ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కనీస వేతనాల అమలు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ బుట్ట దాఖలు చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వివరిస్తున్నారని విమర్శించారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న శ్రమ వల్లనే సింగరేణి సంస్థ రక్షించబడుతుందని అభివృద్ధి బాటలో నడుస్తుందని పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఉండమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భాస్కర్ , విజయ్ గూగులోత్ సక్రాం, బంగి, రాణి, పద్మ, విజయ్ , గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు,ఔట్సోర్సింగు వర్కర్ల పర్మినెంటుకై 7న చలో హైదరాబాదుకు తరలిరండి

* **ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సెప్టెంబర్ 7న హైదరాబాద్ లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్ టియు ఆధ్వర్యంలో జరిగే కాంట్రాక్టు,ఔట్సోర్సింగు వర్కర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య విజ్ఞప్తి చేశారు.బొగ్గు రంగంలో దేశవ్యాప్తంగా హైపవర్ వేతనాలు అమలు చేస్తున్నప్పటికీ సింగరేణిలో అమలు చేయకపోవడం వల్ల 35వేల మంది కాంట్రాక్టు కార్మికులకు 13 ఏండ్లుగా లక్షల రూపాయలు నష్టం జరిగిందని హెచ్ పిసి వేతనాల అమలు బాధ్యత గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలపై ఉందని కోల్ ఇండియా వేతనాలు సాధనకు సింగరేణిలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఉద్యమానికి సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.కొత్తగూడెంలో బంగ్లోస్ ఏరియాలో రాష్ట్ర సదస్సు ప్రచార సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో 2013 నుండి. కోల్ ఇండియా వేతనాలు చెల్లించాల్సి ఉండగా దానిని అమలు చేయడం లేదని ఒప్పందంపై సంతకం చేసిన ఐదు జాతీయ కార్మిక సంఘాలు సింగరేణి యాజమాన్యం మొండి వైఖరిని ఎండగట్టి,కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు అమలు చేయించ లేకపోవడంతో కార్మికుల కష్టార్జితం కోట్లాది రూపాయలు కంపెనీ వద్ద ఉన్నాయని పేదరికంలో ఉన్న కాంట్రాక్టు కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. సింగరేణి పాతికేళ్లుగా లాభాలను సాధించడంలో కాంట్రాక్ట్ కార్మికుల కష్టార్జితం ఉందని గత సంవత్సరం 10వేల రూపాయల బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం 5000 చెల్లించి చేతులు దులుపుతుందని 2024..25లాభాల్లో 15% బోనసు చెల్లించాలని,8 గంటల పనిదినం కొన్ని విభాగాల్లో పిఎఫ్,ఈఎస్ఐ, హాస్పిటల్,యూనిఫామ్, సెలవులు తదితర సౌకర్యాలను,హక్కులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులు ఎడల అనుసరిస్తున్న వివక్షతను నిలదీయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన వేతనాలు చెల్లించాల్సి ఉండగా అందులో ఐదో వంతు కూడా చెల్లించకుండా కాంట్రాక్టు కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆయన విమర్శించారు.కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏడున జరిగే సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్ అధ్యక్షత వహించగా నాగమ్మ, మనమ్మ,రమణ,నర్సమ్మ, రాధా,మంగ,సురేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.



## సాహసోపేత పోరాటంపై అభినందనల హర్షం

* **జర్నలిస్ట్ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డ్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం**
* **ఇమంది ఉదయ్ కుమార్ కి ప్రత్యేక అభినందనలు తెలిపిన జర్నలిస్ట్ మిత్రులు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : జర్నలిస్ట్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్లకార్డు తో నిరసన వ్యక్తం చేసిన సీనియర్ జర్నలిస్ట్ ఇమంది ఉదయ్ కుమార్ ను జర్నలిస్టు మిత్రులు అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సభలో జర్నలిస్టుల సమస్యను శాంతియుతంగా తెలిపేందుకు ఉదయ్ కుమార్ ప్లకార్డుతో నిరసన తెలిపారు. సాహసోపేతమైన కార్యక్రమంతో జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రి సభలో నిరసన తెలిపిన ఉదయ్ కుమార్ ను గురువారం కొత్తగూడెం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో జరిగిన అభినందనల సభ కార్యక్రమంలో కొత్తగూడెం జర్నలిస్ట్ మిత్రులు ఆయనను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పరిష్కారం కానీ జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్నా కానీ జర్నలిస్ట్ సమస్యలు పరిష్కారం కావడం లేదని సాహసోపేత పోరాటానికి తెరదీసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించిన తెలంగాణ ఉద్యమకారుడు సీనియర్ జర్నలిస్ట్ ఇమంది ఉదయ్ కుమార్ అని కొనియాడారు. యూనియన్లకు అతీతంగా ప్రతి ఒక్క జర్నలిస్ట్ కి న్యాయం జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల సుధాకర్ , జాన్సన్ బాబు , కొండ జంపన్న , దశరద్ రజువా , కోలా కుమార్ , మొగిలిపాక మురళీకృష్ణ , చదలవాడ సూరి , వజ్జ చంద్రశేఖర్ , నరేష్ , శిరసాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పన్నులను తగ్గించడం హర్షణీయం

* **బీజేపీ నాయకులు డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పన్నులను తగ్గించడం హర్షణీయమని బీజేపీ నాయకులు డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పాలాభిషేకం కార్యక్రమంలో ఇతర నాయకులతో పాటు బీజేపీ నాయకులు డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు పాల్గొని బీజేపీ ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీ ఎస్ టి శ్లాబులను తగ్గించి, పన్నులను తగ్గించడం హర్షణీయమన్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా బడుగు, బలహీన, అల్పాదాయ వర్గాల వారికి ఊరట కలిగించవచ్చన్నారు. ఆపరేషన్ సిందూర్, వికసిత్ భారత్ వంటి ఎన్నో విజయాలు సాధించిన మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు



## గోదావరి నది ఒడ్డున నిమజ్జన ప్రాంతంలో వీధి కుక్కలతో పరేషాన్

* **భక్తుల భద్రత కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గణేష్ నవరాత్రులు ముగిసిన సందర్భంగా గోదావరి నదిలో విగ్రహాల నిమజ్జనం చేయడానికి జిల్లా నుండి భారీ ఎత్తున తరలి వెళ్తుంటారు.ఈ సందర్భంగా నది ఒడ్డున ఏర్పాట్లు చేసినా, అక్కడ పెద్ద సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తుండటంతో భక్తుల్లో ఆందోళన చెందుతున్నారు.జాగ్రత్తలు పాటించకపోతే కుక్కల కాటుకు గురయ్యే ప్రమాదం ఉందని భక్తులు భయపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో, జిల్లాలో వీధి కుక్కల దాడులతో గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని, కుక్కల సమస్యను పరిష్కరించాల్సిందిగా ప్రజలు అధికారులు కోరుతున్నారు.



## ఇందిరమ్మ ఇంటి పథకం పేదల సామాజిక గౌరవానికి ప్రతిబింబం

* **గూడులేని పేదలు ఉండకూడదనే దృఢ సంకల్పం – ఎమ్మెల్యే కూనంనేని**
* **కేంద్రం సహకరించకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం – ఎంపీ రఘురాం రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల సామాజిక గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండలంలో లబ్ధిదారులకు గురువారం రైతు వేదికలో ఆయన, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మంజూరు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ, "నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే సంకల్పంతో పారదర్శకంగా ఎంపిక చేసి, తొలి దఫాలో 136 మందికి ఇళ్లు మంజూరు చేశాం. దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి గృహవసతి కల్పిస్తాం. అభివృద్ధి నిధుల కోసం ప్రభుత్వాన్ని ఎదురించడానికైనా వెనుకాడను" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. చుంచుపల్లి మండలంలో మూడు జిపి కార్యాలయాలు, లక్ష్మీదేవిపల్లి మండలంలో జిపి కార్యాలయం, అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే విద్యానగర్, సారయ్య కాలనీల త్రాగునీటి సమస్య పరిష్కారానికి రూ.70 లక్షలతో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5.22 కోట్ల ఎల్డబ్ల్యూఈ నిధులతో నిర్మించిన నర్సింగ్ కళాశాలను ఎంపీ రఘురాం రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ, "సొంత ఇల్లు పేద కుటుంబాల కల. ఆ కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. కేంద్రం ఆశించినంత సహకారం అందించకపోయినా పక్కా గృహాలు, ఇతర సంక్షేమ పథకాలను నిర్విరామంగా అమలు చేస్తాం. కొత్తగూడెం అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తా" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ హెచ్లో గురువులకు ఘన సన్మానం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాద్ నగరంలోని ప్రతిష్టాత్మకమైన జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో టీచర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జేఎన్టీయూ లో బీటెక్ చదువుతున్న వర్కింగ్ ప్రొఫెషనల్ కోర్సు చేస్తున్న విద్యార్థులందరూ మెకానికల్ విభాగంలోని సెమినార్ హాల్లో తమకు బోధిస్తున్న మెకానికల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ నాగ శారద, రాంజీ, డాక్టర్ వసంత్ కుమార్, స్రవంతి, అజయ్, శంకర్ గౌడ్, భ్రమర, కిషన్, కిషోర్,రవి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వెంకటరామయ్య, శీను దేవారపు, సి హెచ్ వి రామారావు, కిరణ్ శిష్లా తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది...

* **మాజీ ఉప సర్పంచ్ ఎం. క్రిష్ణ**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మాజీ ఉప సర్పంచ్ మొరబోయిన కృష్ణ అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలోని గురుగుల వాడలోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిదవ రోజు వినాయకుడికి గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మండపం వద్ద యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ మొరబోయిన కృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నోమన్నగారి ధీరాజ్ రెడ్డి, మాణిక్య రెడ్డి, రామన్నగారి ఆంజనేయులు, వని దుర్గయ్య, కాల్వ మీది ప్రశాంత్ లు అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. ఈ అన్నప్రసాద కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గణపతి ఆశీస్సులు ప్రజల అందరిపైనా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని దుర్గా భవాని కమిటీ ఆకాంక్షించారు. అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బాలయ్య,రామన్నగారి జై రాములు,రామన్నగారి బాలకిష్టయ్య, కాల్వమీది రాములు,మొరబోయిన ఈశ్వరయ్య, ఎం మహేష్, రమన్నగారి దత్తు, పెండ నవీన్, తలారి యాదయ్య, తలారి బాలకృష్ణ, కాలమీది ప్రభు, వని మోహన్, సంగన్నగారి శ్రీశైలం, వని కృష్ణ, వని సాయికుమార్, అరుణ్, వని సంతోష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి





* **శ్రీ సాయి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కన్నెకంటి మల్లేష్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ సాయి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కన్నెకంటి మల్లేష్ అన్నారు. చింతల్ శ్రీ సాయి కాలనీలో గురువారం శ్రీ సాయి కాలనీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా మెడివిజన్, నెక్జిన్, అబంత అక్యుసూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష, జనరల్ మెడిసిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాలనీలో గణేష్ ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలన్నారు. శుక్రవారం నిర్వహించే గణేష్ నిమర్జన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నెకంటి లక్ష్మణ్, కన్నెకంటి మల్లేష్, కళ్యాణ్ రావు, చిరంజీవి, బాలాజీ, ఎల్ఐసీ సుబ్రమణ్యం, ట్యాక్స్ శ్రీనివాస్, రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నరేష్, సురేష్, కృష్ణ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ నారాయణ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు

* **నిజమైన ఉపాధ్యాయుడు విద్యార్థుల జీవితంలో మార్పు తీసుకురావాలి**
* **డిజిఎం రమణా రెడ్డి**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రునగర్‌లోని నారాయణ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. డిజిఎం రమణా రెడ్డి, ఎజిఎం రాంకీ, ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా డిజిఎం రమణా రెడ్డి మాట్లాడుతూ “గురువు స్థానం జీవితంలో అతి పెద్దది. నిజమైన ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు నేర్పడం కాదు, విద్యార్థుల వ్యక్తిత్వం, భవిష్యత్తు తీరు మార్చే మార్గదర్శకుడిగా నిలవాలి” అని పేర్కొన్నారు. ఎజిఎం రాంకీ మాట్లాడుతూ “ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విలువలు, ఆచారాలను నేర్పించాలి. వారిచేసే కృషి సమాజం ఎప్పటికీ మరచిపోలేని ఋణం” అని అన్నారు.ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు మాట్లాడుతూ “ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రమశిక్షణ, సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన అవసరం. విద్యార్థుల్లో పరిశోధనాభిరుచి పెంపొందించేందుకు ఆధునిక ల్యాబొరేటరీలు ఏర్పాటు చేశాం. అంతరిక్షంపై అవగాహన కల్పించేందుకు నాసా ప్రాజెక్టులను కూడా అమలు చేయబోతున్నాం” అని వెల్లడించారు.వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు యువ టీచర్లుగా మారి చిన్నతరగతి వారికి పాఠాలు చెప్పి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువ టీచర్లకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఉపాధ్యాయుల కోసం వినోదాత్మక ఆటలు నిర్వహించి పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, డీన్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ రుచిత, పద్మతో పాటు ఉపాధ్యాయులు మల్లేష్, సుజిత్, రమేష్, రవీంద్ర, బాలాజీ, దీప్తి, తేజస్వి, రహీమా, కళ్యాణి, శైలజ, శ్రీలత, జాహ్నవి, అఫ్రీన్, అలియా, ఉష, అఖిల, కావ్య, సరిత, మహేష్, ఏవో వీర, పీఈటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... లక్ష్మీ నగర్ కాలనీ ముండ్లపోచంపల్లిలో కల హెచ్డిఎఫ్సీ బ్యాంకు ఎటిఎం ముందుగల మెట్లపై సుమారు 50 నుండి 60 సంవత్సరాల వయసు గల మగ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. ఇట్టి వ్యక్తి పసుపు రంగు గళ్ళ చొక్కా, కాఫీ కలర్ ప్యాంటు, ధరించి ఉన్నాడు, ఇతని కుడి చేతి పై రామ్ , ఓం పచ్చబొట్టు గలదు, మెడలో ఎరుపు రంగు దారం , మొలతాడు కలదు, ఎడమ చేతికి వాచ్ కలదు, మొహం కోలగా ఉంది, వెంట్రుకలు తెలుపు రంగులో కలవు , ఇతను బహుశా రాత్రి అక్కడే పడుకొని మరణించి ఉండచ్చుని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యప్తు చేపట్టారు.

## భద్రాచలంలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచల పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా, సురక్షితంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.గోదావరి నది తీర ప్రాంతంలో నిమజ్జన ఘాట్‌ల వద్ద లాంచీలు బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లు వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. నదీ తీర ప్రాంతంలో ఎటువంటి అపశృతి జరగకుండా విస్తృత భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భక్తులకు, గణేశ మండపాల నిర్వాహకులకు ముఖ్య సూచనలు చేశారు. వినాయక విగ్రహాల ఊరేగింపులో భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, పెద్ద సంఖ్యలో గుంపులు ఏర్పడి అల్లర్లు చేయకుండా శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. ఊరేగింపుల సమయంలో డీజేలు, అధిక శబ్దపూరిత మ్యూజిక్ వాడకూడదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా మున్సిపల్, పోలీస్ శాఖల సూచనల మేరకు మాత్రమే ఊరేగింపులు కొనసాగించాలన్నారు.నిర్దేశించిన ప్రదేశాలలోనే వినాయక నిమజ్జనం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నదీ ఘాట్ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని భక్తులకు సూచించారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రాకూడదని, విగ్రహాల నిమజ్జనం క్రమపద్ధతిలో జరగాలని ఆయన హెచ్చరించారు.జిల్లా ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, శాంతియుతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత

* **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ ఆర్‌పి కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం ఉపాధ్యాయులందరిని ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా తో కలసి జేడ్పీహెచ్సీ కూకట్పల్లి లో చదువుకున్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సహా విద్యార్థులతో కలసి ఆర్పీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా ఉన్న ఇందిర ని , ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి పాల్గొని ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ సన్మానం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారత దేశ మాజీ రాష్ట్రపతి, మహా విద్యావేత్త, తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఉపాధ్యాయుల పాత్రను స్మరించుకుంటూ, సమాజ భవిష్యత్తు నిర్మాణంలో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. విద్య మాత్రమే కాదు, విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి వంటి గొప్ప గుణాలను విద్యార్థుల్లో నాటేది ఉపాధ్యాయులే అని అన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లనే సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం, జి. ఇందిరా, రవీందర్, నరసింహ, సంధ్యారాణి, గోపిక, చంద్ర రాణి, అఫ్సారా, సహా విద్యార్థులు రాజేందర్ ,శ్రీనివాస్ , నరేష్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బెస్ట్ టీచర్‌గా సుధారాణి

*** వివరాలు వెల్లడించిన మేడ్చల్ జిల్లా డీఈవో**



**(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) :** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు విజ్ఞానసుధ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధా రాణి ఎంపికయ్యారు. మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిని విజయ కుమారి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లోని ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీలోని న్యూ వివేకానంద నగర్ లో గల విజ్ఞానసుధ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుధారాణి బెస్ట్ టీచర్ గా గుర్తింపును పొందారు. 2003 వ సంవత్సరంలో పాఠశాలను స్థాపించి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ప్రధానోపాధ్యాయురాలు గా విధులు నిర్వహిస్తూనే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు విద్యాబోధన చేశారు. 23 సంవత్సరాలుగా తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆమె జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికయింది. బెస్ట్ టీచర్ అవార్డు రావడం పట్ల సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన అపూర్వ గౌరవం అని అన్నారు. పాఠశాల విద్యలో తాను మరింత గౌరవప్రదంగా పనిచేస్తానని వెల్లడించారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన రద్దు



హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన రద్దయింది. ఎల్లుండి గణేశ్ నిమజ్జనోత్సవంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఉపరాష్ట్రతి ఎన్నిక, ఎంపీలతో సమావేశాల కారణంగా అమిత్‌షా తన పర్యటనను రద్దు చేసుకున్నారు.



## సింగరేణిలోని 4 బొగ్గు గనులకు 5స్టార్ రేటింగ్.. అవార్డులు ప్రదానం చేసిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్: ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్న కంపెనీగా ఉన్న సింగరేణి గత ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకుంది. దీనికి సంబంధించిన కార్యక్రమం ఇవాళ ముంబయిలో వైభవంగా జరిగింది. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరామ్ ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్నారు. ప్రతిష్ఠాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు పొందిన గనులలో రామగుండం3 ఏరియాకి చెందిన ఆర్.జి.ఓ.సి 1 ఎక్స్ టెన్షన్, ఇల్లెందు ఏరియాకి చెందిన జేకే5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్కే6 గని, ఆర్కే న్యూటెక్ గనులు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగు గనులకు 5 స్టార్ రేటింగ్ లభించడంపై సీఎండీ బలరామ్ హర్షం వ్యక్తం చేశారు.

# దళారీల చేతిలో మోసపోవద్దు : హైడ్రా కమిషనర్



ప్రజలకు ఏవైనా ఫిర్యాదులుంటే నేరుగా హైడ్రాను సంప్రదించాలని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. హైడ్రా అధికారులు మాకు బంధువులు, మిత్రులు, బాగా తెలుసంటూ ఎవరైనా నమ్మబలికితే వారి చేతుల్లో మోసపోవద్దని హెచ్చరించారు. ఎంతో నిబద్ధత, నిజాయితీతో హైడ్రా ఉద్యోగులంతా పని చేస్తున్నారని.. హైడ్రాకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులన్నా.. సమస్యలున్నా నేరుగా తమను సంప్రదించాలని కోరారు. గతంలో కూడా హైడ్రా అధికారులమంటూ మోసాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేశామన్నారు. తాజాగా మరో ముఠా.. ఒకరు వార్త ప్రసారం చేయడం.. మరొకరు హైడ్రా అధికారులు తెలుసంటూ మాట్లాడుతాను అని చెప్పడం..ఇంకొకరు డబ్బులు దండుకోవడంతో హైడ్రా కమిషనర్ మరోసారి ప్రజలను అప్రమత్తం చేశారు. మోసపోవద్దని హెచ్చరించారు.

**వెలుగులోకి వచ్చిన తాజా దందా..**

ఇటీవల హైడ్రా అధికారులతో మాట్లాడుతానంటూ.. అందరి జీవితాల్లో `వెలుగు`లు నింపుతామని ప్రచారం చేసుకునే ఓ డిజిటల్ మీడియా రిపోర్టర్‌తో పాటు.. ఒకటి రెండు ఇంటర్వ్యూలు చేసి డిజిటల్ మీడియా ప్రతినిధిగా హడావిడి చేసే వ్యక్తి తోడై చేసిన మోసం వెలుగులోకి వచ్చింది. వీరికి ఫేక్ సర్టిఫికేట్లతో న్యాయవాదిగా చెలామణి అవుతూ ఇటీవలే హైకోర్టు బార్ కౌన్సిల్ తొలగించిన వ్యక్తి కూడా తోడయ్యాడు. నువ్వు వార్త ప్రసారం చేయు.. నువ్వు హైడ్రా అధికారులతో మాట్లాడు.. నేను డబ్బులు తీసుకువస్తాను అని న్యాయవాది ఈ కథంతా నడిపి రూ. 50 లక్షలు వసూలు చేసినట్టు హైడ్రాకు ఫిర్యాదు వచ్చింది. వారి చేతిలో మోసపోయిన వ్యక్తినే హైడ్రాను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ మరోసారి ప్రజలను హెచ్చరించారు. ఫిర్యాదుదారులు నేరుగా హైడ్రా ఉన్నతాధికారులను సంప్రదించాలని.. సమస్య ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇరు పక్షాల సమక్ష్యంలోనే విచారణ చేపట్టి న్యాయబద్ధంగా హైడ్రా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

**కేసు బుక్ చేసిన హైడ్రా..**

తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ విలేజ్‌లో వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ లే ఔట్ వేసింది. అక్కడి సూరం చెరువును ఆక్రమించడంతో పాటు కొత్తకుంటలో మట్టి పోసి..బాక్స్ డ్రైన్ నిర్మించిందనే ఫిర్యాదు హైడ్రాకు అందింది. ఈ విషయంలో హైడ్రా విచారణ చేపట్టింది. వర్టెక్స్‌పై రెండు కేసులు కూడా హైడ్రా పెట్టింది. ఇదే తరుణంలో తమ స్థలాన్ని ఆక్రమించి వర్టెక్స్ సంస్థ రోడ్డు వేసిందంటూ చైతన్య రెడ్డి హైడ్రాను ఆశ్రయించారు. రోడ్డును తొలగించాలనే ఫిర్యాదుతో ఇరు పక్షాలతో హైడ్రా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వెల్లడైన అంశాల మేరకు.. చైతన్య రెడ్డి ఓ వ్యక్తికి రూ. 50 లక్షలు అందజేసినట్టు తేలింది. హైడ్రా పేరు చెప్పి.. మోసాలకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొంది. హైడ్రా పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. చైతన్య రెడ్డి ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టింది. పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో హైడ్రా కేసు పెట్టింది. మోసాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా మరోసారి హెచ్చరించారు.

## అంబేద్కర్ హౌజ్‌కు వెళ్లిన హరీష్ రావు



బీఆర్ఎస్ కీలక నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. కుమార్తె ఉన్నత చదువుల కోసం కాలేజీలో చేర్పించేందుకు హరీష్ రావు లండన్ వెళ్లారు. అయితే గురువారం లండన్‌లోని అంబేద్కర్‌ను హౌజ్‌ను హరీష్ రావు సందర్శించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సందర్శన ఫొటోలను స్వయంగా హరీష్‌రావే సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇదిలా ఉంటే.. హరీష్ రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీష్‌రావే కారణమని ఆరోపించారు. హరీష్ రావు, సంతోష్ రావుల వల్ల తన తండ్రి కేసీఆర్ చిక్కుల్లో పడ్డారని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే కవిత ఆరోపణలపై హరీష్ రావు ఇప్పటివరకు స్పందించలేదు. అంశంలో ఆయన స్పందన ఎలా ఉంటుందనేది బీఆర్ఎస్ శ్రేణులతో పాటు రాష్ట్ర రాజకీయ నేతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎన్ఐఆర్ఎఫ్ జాబితా విడుదల.. వరుసగా ఏడోసారి టాప్‌లో మద్రాస్ ఐఐటీ

నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2025ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ విడుదల చేశారు. ద ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మద్రాస్ ఈ ఏడాది కూడా పలు ర్యాంకులు సంపాదించి అగ్రస్థానంలో నిలిచింది. 'ఓవరాల్' కేటగిరీలో వరుసగా ఏడోసారి టాప్ ర్యాంక్ దక్కగా.. ఇంజినీరింగ్ విభాగంలో వరుసగా 10వ ఏడాది తొలి స్థానం సంపాదించుకున్నట్లు విద్యాసంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆవిష్కరణల విభాగంలో గతేడాది రెండో స్థానం రాగా.. ఇప్పుడు నంబర్ వన్ స్థానం దక్కించుకొంది. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కేటగిరీలోనూ ఐఐటీ మద్రాస్ పైచేయి సాధించింది. 'నిరంతరం టాపర్‌గా నిలవడం సమష్టి, సమన్వయ, బృంద కృషికి దక్కిన ఫలితం. ఇంతటి అద్భుతమైన బృందం మాకు ఉండటం భగవంతుడి దయ. మేమంతా వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనకు కృషి చేస్తాం' అని ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ వి.కామకోటి తెలిపారు.




### ఓవరాల్ కేటగిరీలో టాప్ విద్యాసంస్థలు

* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బాంబే
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీ
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఖరగ్‌పూర్
* ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూర్కీ
* ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఢిల్లీ
* జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ
* బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

### టాప్ 10 విశ్వవిద్యాలయాలు

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ
మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మణిపాల్
జామియా మిలియా ఇస్లామియా, న్యూఢిల్లీ
ఢిల్లీ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ
బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి
బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్‌పిలానీ
అమృత విశ్వ విద్యాపీఠం, కోయంబత్తూర్
జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా
అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, అలీగఢ్

### టాప్ 5 కళాశాలలు

* హిందూ కళాశాల, ఢిల్లీ
* మిరాండా హౌస్, ఢిల్లీ
* హన్స్ రాజ్ కళాశాల, ఢిల్లీ
* కిరోడి మాల్ కళాశాల, ఢిల్లీ
* సెయింట్ స్టీఫెన్స్ కళాశాల, ఢిల్లీ

## రాష్ట్రపతి కారుకు జీఎస్టీ మినహాయింపు..?

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కాన్వాయ్‌లోకి సరికొత్త వాహనం చేరనుంది. ప్రస్తుతం ఆమె మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మ్యాన్ లిమోజిన్‌ను వాడుతున్నారు. దీనిని సరికొత్త బీఎండబ్ల్యూ కారుతో భర్తీ చేయనున్నారు. కొత్త వాహనం ఖరీదు రూ.3.66 కోట్లు. రాష్ట్రపతి వాహనశ్రేణిని క్రమం తప్పకుండా అప్‌గ్రేడ్ చేస్తుంటారు. భద్రతా కారణలరీత్యా వీటిల్లోకి విలాసవంతమైన, కస్టమ్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను మాత్రమే తీసుకొంటారు. అందులోభాగంగానే ఈ కొత్త కారు రానుంది. సాధారణంగా ఈ హైఎండ్ కారును ఎవరైనా దిగుమతి చేసుకొంటే భారీ పన్నులు విధిస్తారు. దీనికితోడు 28 శాతం (సరికొత్త రేట్ల ప్రకారం అయితే 40%) జీఎస్టీ లేదా ఐజీఎస్టీ విధిస్తారు. ఇక బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, అదనపు సెస్సు కలిసి ధర తడిసి మోపెడవుతుంది. కానీ, దేశ రాష్ట్రపతికి అవసరమైన వాహనం కావడంతో జీఎస్టీ కౌన్సిల్ ఐజీఎస్టీ, సెస్సు నుంచి దీనికి ప్రత్యేక మినహాయింపును ప్రతిపాదించింది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇటీవల ఆమోదముద్ర పడింది. ఇలా మినహాయింపు



ఇవ్వడం చాలా అరుదు. కేవలం ప్రత్యేక కేసులు, ప్రజాప్రయోజనాలు ఉన్న సమయంలో వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఇలాంటి మినహాయింపు లభిస్తుంటుంది. ఈ క్రమంలో రాష్ట్రపతి సెడాన్ కారును దేశ ఆస్తిగా భావిస్తారు. తాజా చర్యతో ప్రెసిడెంట్ సెక్రటేరియట్ ఎటువంటి పన్నులు చెల్లించకుండా వాహనం కొనుగోలు చేసే అవకాశం లభించింది. ప్రస్తుతం వాడుతున్న ఎస్600 (S600) పుల్‌మ్యాన్ గార్డ్ భద్రతా ఫీచర్లకు పేరున్న కారు. దీనిలో బాలిస్టిక్, హెవీ ఆర్మర్ ప్లేటింగ్, మల్టీ లేయర్ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్, సెల్ఫ్ సీలింగ్ ఇంధన ట్యాంక్, ప్రత్యేకమైన టైర్లు, ఆక్సిజన్ సప్లై సిస్టమ్ వంటివి ఉన్నాయి.

## అక్రమంగా చెట్లు నరికివేయడం వల్లే..: వరదలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

భారీ వర్షాలతో ఉత్తరభారతం అతలాకుతలం అవుతోంది. మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలతో ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తున్నాయి. ఈ విపత్తులపై దృష్టిసారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమంగా చెట్లను నరికివేస్తుండటం వల్లే పంజాబ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రకృతి విలయం సృష్టిస్తోందని వ్యాఖ్యానించింది. ''ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల్లో సంభవిస్తోన్న ప్రకృతి విపత్తులను మనం చూస్తున్నాం. కొండ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లు నరుకుతున్నట్లు మీడియాలో వస్తోన్న కథనాలతో ప్రాథమికంగా స్పష్టమైన ఆధారాలున్నాయి. వరద నీటిలో భారీ స్థాయిలో దుంగలు తేలియాడుతున్నట్లు ఆ వార్తల్లో గమనించాం'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. వరుస విపత్తులతో కొండ ప్రాంతాల్లో



పర్యావరణ సమతుల్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిని విచారించిన సుప్రీం ధర్మాసనం.. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంది. దీనిపై కేంద్రం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అలాగే సంబంధిత అధికారులను సంప్రదించి ఆ స్థాయిలో దుంగలు నీటిలో తేలియడానికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. తిరిగి రెండు వారాల తర్వాత ఈ అంశంపై విచారణ జరగనుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో పలుమార్లు క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ఈ విపత్తులో భారీసంఖ్యలో ప్రాణనష్టం చోటుచేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కొండచరియలు విరిగిపడుతుండగా, పంజాబ్‌లోనూ వరదలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఢిల్లీకి వరద ముప్పు క్రమంగా పెరుగుతోంది. నిరాశ్రయుల కోసం ఏర్పాటుచేసిన శిబిరాలే వరద నీటిలో చిక్కుకుపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా యమునా నది ఉప్పొంగుతోంది.

## ఓటరు ఐడీ.. ఒకటికి మించి ఉంటే సరెండర్ చేయాలి ఈసీ



ఢిల్లీ: ఓటరు కార్డులకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకటికి మించి ఓటరు కార్డులు కలిగి ఉండటం నేరమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్నట్లయితే ఒకదాన్ని మాత్రమే పెట్టుకొని, అదనపు కార్డులను సరెండర్ చేయాలని స్పష్టం చేసింది. ''రెండు ఓటరు కార్డులను కలిగి ఉండటం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం నేరం. సెక్షన్ 31 కింద వారికి గరిష్ఠంగా ఏడాది శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండొచ్చు. ఒకవేళ ఎవరి వద్దనైనా రెండు, అంతకంటే ఎక్కువ కార్డులు ఉంటే ఒకటి మాత్రమే తమ వద్ద ఉంచుకోవాలి'' అని ఈసీ అధికారులు వెల్లడించారు. ఓటరు జాబితాలో రెండు చోట్ల ఓటరుగా ఉన్నట్లయితే.. ఒకచోట తమ పేరును తొలగించాలని కోరుతూ ఫారం 7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లోనూ వెసులుబాటు ఉందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ మీడియాపబ్లిసిటీ సెల్ ఛైర్మన్ పవన్ ఖేడాకు రెండు ఓటరు కార్డులున్నాయనే ఫిర్యాదు రావడంతో ఎన్నికల సంఘం ఆయనకు ఇటీవల నోటీసు జారీచేసింది. దీనిపై ఖేడా స్పందిస్తూ.. ఎన్నికల అధికారుల తీరును తప్పుపట్టారు. డిలీట్ చేయాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఈసీ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించలేదన్నారు.

## 8 ఏళ్ల తర్వాత జీఎస్టీపై కేంద్రం యూటర్న్: చిదంబరం



ఢిల్లీ: వస్తుసేవల పన్నుపై కేంద్ర ప్రభుత్వం ఇన్నాళ్లూ తప్పుదోవలో వెళ్లిందని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం విమర్శించారు. ఆ తప్పును గ్రహించి తాజాగా యూటర్న్ తీసుకుందని అన్నారు. ఈనెల 22 నుంచి 5, 18 శాతాల శ్లాబులు తీసుకొస్తున్నామని ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో చిదంబరం స్పదించారు. 'జీఎస్టీ హేతుబద్ధీకరణ, రేట్లు తగ్గించడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి 8 ఏళ్లు పట్టడం చాలా ఆలస్యమే' అని పేర్కొన్నారు. జీఎస్టీ రూపకల్పన సరిగా లేదని కాంగ్రెస్ సహా పలువురు ఆర్థికవేత్తలు గతంలోనే ప్రశ్నించారని వ్యాఖ్యానించారు. మధ్యతరగతి, పేద ప్రజలు ఈవిషయంపై గొంతెత్తినా ప్రభుత్వం వినిపించుకోలేదని ఆరోపించారు. జీఎస్టీ ఎల్లప్పుడూ 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్'లా ఉండాలని చిదంబరం ఆకాంక్షించారు. తాజా నిర్ణయంతో పేద, మధ్యతరగతి వర్గాలకు కొంత ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. లోపభూయిష్టమైన జీఎస్టీ డిజైన్, సంక్లిష్ట శ్లాబులను ప్రభుత్వం, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పలుమార్లు సమర్థించుకున్నారని చెప్పారు. నిన్నటి మార్పులకు వారే చప్పట్లు కొట్టుకోవడం గమనించాల్సిన విషయమన్నారు. వృద్ధి మందగించడం, గృహ రుణాలు పేరుకుపోవడం, పొదుపు క్షీణించడం, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ట్రంప్ టారిఫ్‌లే జీఎస్టీ రేట్ల మార్పునకు కారణమా? అని ప్రశ్నించారు. అసలైన జీఎస్టీ 2.0 కోసం ఎదురుచూస్తున్నానని కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. జీఎస్టీ 1.5 సంస్కరణలు బాగున్నాయన్నారు. తమ ఆదాయాలను రక్షించుకోవడానికి మరో ఐదేళ్లు పరిహారం పొడిగించాలని రాష్ట్రాలు చేస్తున్న డిమాండ్ ఇంకా మిగిలేఉందని గుర్తు చేశారు. నూతన జీఎస్టీ ప్రైవేటు పెట్టుబడులకు ఊతమిస్తుందా? ఎంఎస్ఎంఈలపై భారాన్ని తగ్గిస్తుందా? అనే ప్రశ్నలకు కాలమే సమాధానమివ్వాలన్నారు. జీఎస్టీ 1.0 తుది అంకానికి చేరిందనే విషయాన్ని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఎట్టకేలకు గుర్తించారన్నారు. 2017లోనే కాంగ్రెస్ దీనిపై అభ్యంతరం వ్యక్తంచేసిందని చెప్పారు. మంచి సులభతర పన్ను కాస్తా వృద్ధిని అణిచివేసే పన్నుగా మారుతుందని తాము అప్పట్లోనే హెచ్చరించామని తెలిపారు.

## వందలాది 'రిజిస్టర్డ్ పోస్టు'లతో మహిళ దండయాత్ర.. ఎందుకంటే..!

భోపాల్: క్షణాల వ్యవధిలోనే ఎక్కడికైనా సందేశాన్ని చేరవేయగల ప్రస్తుత డిజిటల్ యుగంలో.. రిజిస్టర్డు పోస్టు (Registered Post) ద్వారా రికార్డు సృష్టించేందుకు ఓ మహిళ తనవంతు కృషి చేస్తోంది. ఆమే మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన రేణుదేవీ శుక్లా. బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న ఈ సేవలను తపాలాశాఖ సెప్టెంబరు 1 నుంచి స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేయనుందని తెలుసుకుంది. ఈ క్రమంలోనే గడువుకు ముందు రిజిస్టర్డు పోస్ట్ ద్వారా ఏకంగా 1,314 ఉత్తరాలను ఆయా చిరునామాలకు పంపించింది. దీని కోసం రెండు రోజులు కష్టపడటంతోపాటు రూ.35 వేలు వెచ్చించడం గమనార్హం. అయితే, రిజిస్టర్డు పోస్టు తుది గడువును తపాలా శాఖ ఈ నెల 30 వరకు పొడిగించింది. దీంతో మరిన్ని రిజిస్టర్డు లెటర్‌లు పంపాలని ఆమె యోచిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. స్పీడ్ పోస్ట్‌లో



విలీనమయ్యాక కూడా గతంలో మాదిరిగానే రిజిస్టర్డు పోస్ట్‌లను సంబంధిత వ్యక్తులు నేరుగా వచ్చి డెలివరీ చేస్తారని, డెలివరీ రసీదు, రియల్ టైమ్ ట్రాకింగ్ ఉంటుందని తపాలా శాఖ ఇటీవల స్పష్టం చేసింది.

## సుంకాలతో.. అమెరికాకు నెలలో రూ.2.73లక్షల కోట్ల ఆదాయం!

ప్రపంచ దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారీ స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆగస్టు నెలలో 31 బిలియన్ డాలర్ల (రూ.2.73లక్షల కోట్లు) రికార్డు స్థాయి ఆదాయం వచ్చినట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. నెలవారీ ఆదాయాల్లో ఇదే అత్యధికంగా పేర్కొంది. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 158 బి.డాలర్ల ఆదాయం రాగా.. గతేడాదితో పోలిస్తే రెండున్నర రెట్లు అధికంగా వచ్చినట్లు తెలిపింది. వివిధ దేశాలపై సుంకాలు విధించిన తర్వాత అమెరికా ఆదాయం క్రమంగా పెరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.




ఏప్రిల్‌లో 17.4 బిలియన్ డాలర్లు వసూలు కాగా.. మే నెలలో 23.9 బి.డాలర్లకు పెరిగింది. అనంతరం జూన్‌లో 28 బి.డాలర్లు, జులైలో 29 బి.డాలర్లు వచ్చింది. తాజాగా ఆగస్టులో రికార్డు స్థాయిలో 31బి.డాలర్ల ఆదాయం సమకూరినట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. ఈ లెక్కన చూస్తే.. గత ఏడాదిలో వచ్చిన ఆదాయాన్ని కేవలం నాలుగైదు నెలల్లోనే వసూలు చేసినట్లు అంచనా. భారీ స్థాయిలో సుంకాలు విధించడాన్ని సమర్థించుకుంటున్న డొనాల్డ్ ట్రంప్.. వీటివల్ల వచ్చే ఆదాయం అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు అయ్యే ఖర్చును ఇది భర్తీ చేస్తుందని పేర్కొంటున్నారు. ఇదిలాఉంటే, ఆగస్టు 18 నాటికి అమెరికా అప్పులు 37.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్థికశాఖ ఇటీవల వెల్లడించింది.

## అదేం సీక్రెట్ కాదు.. మోదీతో కారులో సంభాషణపై పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనాలో పర్యటించిన భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు ద్వైపాక్షికంగా భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరువురు అధినేతలు ఒకే కారులో కొంత దూరం మాట్లాడుకుంటూ ప్రయాణించారు. ఈ క్రమంలో వారు ఏం మాట్లాడుకున్నారనే దానిపై సర్వత్రా చర్చ జరిగింది. దీనిపై తొలిసారిగా పుతిన్ స్పందించారు. చైనా పర్యటన పూర్తి చేసుకున్న పుతిన్ మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా మోదీతో కారులో జరిగిన సీక్రెట్ సంభాషణ గురించి ఓ విలేకరి ఆయన్ను ప్రశ్నించారు. దీనికి పుతిన్ బదులిస్తూ.. 'అదేం పెద్ద రహస్యం కాదు. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల గురించి మోదీకి వివరించాను' అని పేర్కొన్నారు. కాగా.. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే అంశంపై ట్రంప్, పుతిన్‌లు ఇటీవల అలాస్కాలో సమావేశమయిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఈ ఇద్దరు నేతలు కారులో ప్రయాణించారు. ఆ కారులో అమెరికా అధినేతతో జరిగిన సంభాషణ వివరాలు కూడా ఇప్పుడు పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగిందని తెలిపారు. తాము 30 సెకన్లు మాత్రమే మాట్లాడుకున్నామని.. ట్రంప్ ఆరోగ్యంగా ఉండటం చూసి సంతోషంగా ఉన్నానని అతనితో చెప్పినట్లు వెల్లడించారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. పది నిమిషాలు నిరీక్షించి మరీ.. మోదీని పుతిన్ తన కారులో తీసుకెళ్లారు. దాదాపు ముప్పావుగంట సేపు ఇరువురి నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని



క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. పుతిన్‌తో కారులో ప్రయాణించిన ఫొటోను మోదీ నాడు ఎక్స్‌లో పంచుకున్నారు. తమ మధ్య చర్చలు ఎప్పుడూ వివేకంతో జరుగుతాయని, ఈసారీ అద్భుతంగా సాగాయని తెలిపారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో వీరి ద్వైపాక్షిక భేటీ తీవ్ర చర్చనీయాంశమైంది.

# జీఎస్టీ సంస్కరణలు..

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. జీఎస్టీ శ్లాబ్‌లను మారుతూ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ప్రస్తుతం ఉన్న జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండు మాత్రమే ఉండనున్నాయి. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 12శాతం, 28శాతం శ్లాబ్‌లను జీఎస్టీ కౌన్సిల్ తొలగించింది. ఈ క్రమంలో ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలు, జీఎస్టీ సంస్కరణలతో మార్కెట్లు భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో భారీగా అమ్మకాలు జరగడంతో మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌లో పోలిస్తే సెన్సెక్స్ 81,456.67 పాయింట్ల లాభాల్లో మొదలైంది.

ఇంట్రాడేలో 81,456.67 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. 80,608.94 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 150.30 పాయింట్ల లాభంతో 80,718.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.25 పాయింట్లు పెరిగి 24,734.30 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.6 శాతం పతనమయ్యాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే లాభాల్లో కొనసాగగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా కన్స్యూమర్, విప్రో, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ఇండ్ బ్యాంక్ నష్టపోయాయి. ఆటో ఇండెక్స్ దాదాపు 1శాతం, ఎఫ్‌సీఎంజీ ఇండెక్స్ 0.3 శాతం, ఐటీ, మీడియా, మెటల్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ 0.5 నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి.

బ్రిటానియా, బాటా ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్ జీఎస్టీ పన్ను కోతల తర్వాత ఒకటి నుంచి ఆరుశాతం వరకు పెరిగాయి. జీఎస్టీ 12శాతం నుంచి 5శాతానికి తగ్గింపుతో బికాజీ, ప్రతాప్ స్నాక్స్ షేర్లు 3శాతం పెరిగాయి. పన్నును 28 శాతం నుంచి 40 శాతానికి పెంచడంతో డెల్టా కార్ప్ షేర్లు 8శాతం పడిపోయాయి. బీఎస్ఇలో దాదాపు 140 స్టాక్‌లు 52 వారాల గరిష్టానికి చేరాయి. ఎం అండ్ ఎం, జైడస్ వెల్నెస్, మహారాష్ట్ర స్కూటర్స్, ముత్తూట్ ఫైనాన్స్, నువోకో విస్టాస్, కమ్మిన్స్ ఇండియా, ఐషర్ మోటార్స్, నైకా, టీవీఎస్ మోటార్, లెమన్ ట్రీ హోటల్స్, మారికో, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, దాల్మియా భారత్, ఎంఆర్ఎఫ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండియా సిమెంట్స్, మారుతి సుజుకి, పేటీఎం ఉన్నాయి. యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 14 పైసలు తగ్గి 88.16 వద్ద ముగిసింది.

## సిమెంట్, ఉక్కుపై జీఎస్టీ రేట్ల తగ్గింపు..

### రియల్ ఎస్టేట్‌కు ప్రోత్సాహం..!




**న్యూఢిల్లీ:** కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. నాలుగు శ్లాబులను రెండింటికి కుదించింది. ఈ మార్పుతో రియల్ ఎస్టేట్‌కు ఊతం లభిస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. నిర్మాణరంగంలోని పలు వస్తువల ధరలకు సంబంధించిన శ్లాబ్‌ను మార్చడంతో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. భారత్, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా సీబీఆర్ఈ అధ్యక్షుడు, సీఈవో అన్షుమాన్ జీఎస్టీ మార్పుతో వ్యయ ప్రభావాలను హైలెట్ చేశారు. సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్ సాధారణంగా మొత్తం నిర్మాణ వ్యయంలో 40-45 శాతం వాటా కలిగి ఉంటాయని తెలిపారు. దాంతో తగ్గింపు ప్రాజెక్ట్ ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. డెవలపర్లు ఇప్పుడు పొదుపులో కొంత భాగాన్ని గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయవచ్చని.. దాంతో గృహాలను కొనుగోలు చేసే అవకాశం పెరగడంతో అన్నిరంగాల్లో డిమాండ్‌ను పెంచుతుందన్నారు. పండుగ సీజన్‌లో సరైన సమయంలోనే జీఎస్టీ సంస్కరణలు వచ్చాయి. గృహాభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధారిత ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వ విస్తృత దృష్టికి ప్రభుత్వ చర్యలు ఊతమిస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

హిరనందని గ్రూప్, నరేడ్కో నేషనల్ చైర్మన్ నిరంజన్ హిరనందని కేంద్రం నిర్ణయాన్ని భారతీయ వినియోగదారులకు 'పండుగ కానుక'గా, ఆర్థిక వ్యవస్థకు వ్యూహాత్మక ప్రోత్సాహకంగా అభివర్ణించారు. రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగాలకు, సిమెంట్, ఉక్కు వంటి కీలకమైన నిర్మాణ సామగ్రిపై జీఎస్టీని 28శాతం నుంచి 18శాతానికి తగ్గించడం చారిత్రాత్మక సంస్కరణగా పేర్కొన్నారు. నిర్మాణ వ్యయంలో తగ్గుదల గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయడం వల్ల.. గృహ నిర్మాణ రంగం ఎక్కువగా ప్రయోజనం పొందుతుందని హిరనందని తెలిపారు. దాంతో గృహాలు మరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇది 'అందరికీ గృహనిర్మాణం' అనే ప్రభుత్వ కల సాకారానికి ఊతమిస్తుందని తెలిపారు. డెవలపర్లకు మాత్రమే కాకుండా వినియోగదారులకు, గృహనిర్మాణ రంగానికి.. భారతదేశ దీర్ఘకాలిక వృద్ధికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, నరేడ్కో జాతీయ అధ్యక్షుడు జీ హరిబాబు మాట్లాడుతూ జీఎస్టీ హేతుబద్ధీకరించడం చాలా ముఖ్యమైన దశ అని.. పరిశ్రమ హృదయపూర్వకంగా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ చర్య రియల్ ఎస్టేట్, సంబంధిత పరిశ్రమలకు ప్రత్యేక ఉపశమనం కల్పిస్తుందని హరిబాబు తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగానికి, దేశ వృద్ధికి ఒక విజయమని.. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక ఊపును సృష్టించే ప్రగతిశీల చర్యగా భావిస్తున్నామన్నారు.

## మారిన జీఎస్టీ శ్లాబులు..

### ఏసీలు, టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గుతాయా.. పెరుగుతాయా..?



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబులు ఉండగా.. రెండింటికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలకు ఆమోదం తెలిపారు. ఈ నెల 22 నుంచి కొత్త శ్లాబులు అమలులోకి రానున్నాయి. ప్రభుత్వం ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నును తగ్గించింది. చాలా ఉత్పత్తులపై జీఎస్టీ 28శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయాలనుకునే వారికి మాత్రం ఎలాంటి ఊరటనివ్వలేదు. జీఎస్టీ సంస్కరణల తర్వాత కూడా స్మార్ట్‌ఫోన్లపై జీఎస్టీ 18శాతం వర్తిస్తుంది. మొబైల్ ఫోన్లు ఇప్పటికే 18శాతం శ్లాబ్‌లోనే ఉంటుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. 18శాతం తర్వాత 5శాతం శ్లాబ్ మాత్రమే ఉందని.. దాంతో స్మార్‌ఫోన్ తయారీదారులు ఎలాంటి మార్పులను ఆశించడం లేదని.. స్మార్ట్‌ఫోన్లపై పన్ను తగ్గిస్తే బాగుంటుందని ఇండస్ట్రీ మాత్రం ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకు ముందు ఎయిర్ కండీషన్‌లపై జీఎస్టీ 28శాతం వర్తించేది. ఇకపై 18శాతం శ్లాబ్‌లోకి ఏసీలు రానున్నాయి. 32 ఇంచులకంటే పెద్ద ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీలపై 28శాతం నుంచి 18శాతానికి తగ్గించారు. ఇప్పటికే 32ఇంచులు, అంతకంటే తక్కువగా ఉన్న టీవీలపై జీఎస్టీ 18శాతం వర్తిస్తున్నది.

# తొలిసారి సెమీఫైనల్లో..





### భారత స్టార్‌ను ఊరిస్తున్న కలల ట్రోఫీ..!

**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ తన కలల ట్రోఫీకి మరింత చేరువయ్యాడు. గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ప్రతిసారి తడబడే అతడు ఆద్యంతం అదరగొడుతూ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. యూఎస్ ఓపెన్‌లో సంచలన ఆటతో దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టాడు బాంబ్రీ. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బాంబ్రీ - మైఖేల్ వీనస్ (న్యూజిలాండ్) ద్వయం పదకొండో సీడ్‌కు చెక్ పెట్టింది. తొలి సెట్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న ఈ జోడీ నికొలా మెక్టిక్ - రాజీవ్ రామ్ జంటను చిత్తు చేసింది.

యూఎస్ ఓపెన్‌లో భారత డబుల్స్ ఆటగాడు యుకీ బాంబ్రీ జోడీ సంచలన విజయాలతో దూసుకుపోతోంది. హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో బాంబ్రీ - వీనస్ ద్వయం అసమాన పోరాటం కనబరిచింది. నికొలా- రజీవ్ జంట తొలి సెట్‌ను 6-3తో కైవసం చేసుకొని షాకిచ్చింది. అయినా సరే ఒత్తిడికి లోనవ్వలేదు బాంబ్రీ జంట.

రెండో సెట్‌లో టాప్‌గేర్ ఆటతో ప్రత్యర్థికి షాకిస్తూ 7-6తో సెట్ గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ బాంబ్రీ - వీనస్ రెచ్చిపోయారు. పదకొండో సీడ్ జోడీని నిలువరిస్తూ 6-3తో విజయం సాధించారు. దాంతో.. తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు బాంబ్రీ. ఫైనల్ బెర్తు కోసం జరిగే పోరులో బ్రిట్స్ నీల్ స్కుప్స్కీ, జో సలిస్‌బరీ జోడీని బాంబ్రీ - వీనస్ జంట ఢీకొననుంది.

# మూడు ఫార్మాట్లకూ వీడ్కోలు పలికిన వెటరన్ స్పిన్నర్..

### 25 ఏళ్ల కెరీర్ సాగిందిలా..!



**న్యూఢిల్లీ:** భారత వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఒకానొక దశలో తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా ప్రధాన అస్త్రంగా మారిన మిశ్రా అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు వెల్లడించాడు. 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు మంగళం పాడుతున్నట్టు గురువారం ప్రకటించాడీ స్పిన్ దిగ్గజం. అయితే.. ఇండియన్ ప్రీమియర్ లీగ్, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని 42 ఏళ్ల మిశ్రా తెలిపాడు.

'అంతర్జాతీయ క్రికెట్‌లో 25 ఏళ్ల అనుభవం కలిగిన నేను ఈరోజుతో వీడ్కోలు పలకుతున్నాను. నా మొదటి ప్రేమ, తొలి గురువు, నాకెంతో సంతోషాన్నిచ్చే ఆటకు రిటైర్మెంట్ చెబుతున్నాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో భావోద్వేగాలు, గర్వపడిన క్షణాలు, బాధపడిన సందర్భాలు, నేర్చుకున్న విషయాలు చాలానే ఉన్నాయి. నాకు అవకాశం కల్పించినందుకు బీసీసీఐకి, హర్యానా క్రికెట్‌కు ధన్యవాదాలు. నాకు ప్రతి అడుగులో ఎంతగానో సహకరించిన కోచ్‌లు, సహాయక సిబ్బంది.. మరీ ముఖ్యంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని మిశ్రా పేర్కొన్నాడు.

దేశవాళీలో అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిలో పడిన మిశ్రా 2003లో తొలి వన్డే ఆడాడు. అయితే.. .. 2017లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఆ త ర్వాత నుంచి అవకాశాల కోసం ఎదురుచూసినా సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. దాంతో.. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కనిపిస్తున్న మిశ్రా ఇక రిటైర్మెంట్ సమయం వచ్చేసిందని భావించాడు.

సినీయర్లు అశ్విన్, ఛతేశ్వర్ పూజారాలు అన్ని ఫార్మట్ల నుంచి తప్పుకున్నందున తాను కూడా అల్విదా చెప్పాలని నిర్ణయించుకున్నాడు. భారత జట్టు తరఫున 22 టెస్టులు, 36 వన్డేలు, 10 టీ20లు ఆడాడీ లెగ్ స్పిన్నర్. మూడు ఫార్మాట్లలో కలిపి 156 వికెట్లు పడగొట్టాడు. 2008లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన మిశ్రా తొలి మ్యాచ్‌లోపే 5 వికెట్లతో మెరిశాడు.

# చిక్కుల్లో శిఖర్ ధావన్

### బెట్టింగ్ యాప్ కేసులో విచారణకు రావాలని ఈడీ సమన్లు



**న్యూఢిల్లీ:** బెట్టింగ్ యాప్స్ వ్యవహారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన కారణంగా ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు విచారణ ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా ఆ లిస్ట్‌లో చేరిపోయారు. బెట్టింగ్ యాప్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శిఖర్ ధావన్‌కు తాజాగా సమన్లు జారీ చేశారు. 1ఎక్స్‌బెట్ అనే యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులను ఈడీ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ చాలా మంది వ్యక్తులతో పాటు పెట్టుబడిదారులను రూ.కోట్లల్లో మోసం చేయడంతో పాటు భారీ మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలున్నాయి. ఇక నిషేధిక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన కారణంగా ఇప్పటికే పలువురు టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు కూడా విచారణకు హాజరైన విషయం తెలిసిందే. మాజీ క్రికెటర్ సురేశ్ రైనా సైతం గత నెల ఈడీ ముందు హాజరయ్యారు.

# ఐపీఎల్ అభిమానులకు షాక్..!

### టికెట్లపై 40శాతం జీఎస్టీ..!




**న్యూఢిల్లీ:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వస్తు, సేవల పన్ను విధానంలో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకుంది. పన్నుల విధానాన్ని సరళతరం చేస్తూ ఇప్పటి వరకు ఉన్న నాలుగు శ్లాబులను కేవలం రెండు శ్లాబులకు కుదిరించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ మండలి సమావేశంలో పలు కీలక తీసుకున్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న 12శాతం, 28శాతం శ్లాబులను తొలగించారు. ఇకపై 5శాతం, 18శాతం జీఎస్టీ శ్లాబులు మాత్రమే ఉంటాయి. కొత్త జీఎస్టీ శ్లాబులు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో సామాన్యులకు కొంత వరకు ఊరట కలిగినా.. దేశంలో అత్యంత ప్రజాధారణ పొందిన క్రికెట్‌పై భారీగా ప్రభావం ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ఏకంగా 40శాతం పన్ను విధించాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది.

### ఐపీఎల్ టికెట్లపై 40శాతం జీఎస్టీ..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వంటి క్రికెట్ ఈవెంట్లపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది. ఇకపై ఐపీఎల్ స్పోర్ట్స్ ఈవెంట్ల టికెట్ల విక్రయాలపై 40శాతం జీఎస్టీ విధించనున్నారు. దాంతో టికెట్ ధరలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుంది. దాంతో ప్రేక్షకుల జేబులపై అదనపు భారం పడే అవకాశం ఉంది. అయితే, 40శాతం రేటు ఐపీఎల్ వంటి ఈవెంట్లకు మాత్రమే వర్తించనున్నది. మరోవైపు, గుర్తింపు పొందిన స్పోర్ట్స్ ఈవెంట్‌లపై ఈ భారీ పన్ను విధించే అవకాశం లేదు. గుర్తింపు పొందిన స్పోర్ట్స్ ఈవెంట్‌కు టికెట్ రూ.500 వరకు ఉంటే.. గతంలో మాదిరిగానే జీఎస్టీ ఉండదు. రూ.500 కంటే ఎక్కువ ధర ఉన్న టిక్కెట్లపై 18 శాతం చొప్పున జీఎస్టీ కొనసాగుతుంది. అంటే, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడా టోర్నమెంట్ల ప్రేక్షకులపై ఎటువంటి అదనపు భారం ఉండదన్న మాట.

### ఆ ఆటలపై కఠినంగా ప్రభుత్వం..

బెట్టింగ్, జూదం, లాటరీ, గుర్రపు పందెం, ఆన్‌లైన్ మనీ గేమింగ్ వంటి కార్యకలాపాలను 40 శాతం పన్ను పరిధిలోకి తీసుకురావాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ నిర్ణయం ఈ రంగాల వ్యాపారాన్ని ప్రభావితం చేయడమే కాకుండా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరనున్నది. అయితే, జీఎస్టీ స్లాబ్‌లో మార్పుల కారణంగా ఐపీఎల్ వంటి ఫ్రాంచైజ్ ఆధారిత ఈవెంట్‌లు ఖరీదైనవి మారనుండగా.. గుర్తింపు పొందిన ఈవెంట్లలో పాల్గొనే ప్రేక్షకులకు మాత్రం ఉపశమనం కలుగనున్నది. ఈ నిర్ణయం ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా ఒక కీలకమైన అడుగు అని నిపుణులు భావిస్తున్నారు. అయితే దీర్ఘకాలంలో, ప్రేక్షకుల భాగస్వామ్యం, ఐపీఎల్‌లాంటి ఈవెంట్ల ప్రజాధారణపై ప్రభావం కనిపిస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# పవర్‌ఫుల్ రోల్‌లో అనుష్క ఘాటి



**టాకీస్:** అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో దర్శకుడు క్రిష్ తెరకెక్కించిన సినిమా 'ఘాటి' ఈ యాక్షన్ క్రైమ్ డ్రామా ఈనెల 5న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా రిలీజ్ గ్లింప్స్ విడుదలైంది. అగ్రకథానాయకుడు ప్రభాస్ దీన్ని పంచుకున్నారు. 'వాళ్ల ఊరుకోరు, వీళ్ల ఊరుకోరు, అంటే నేను ఊరుకోను..' అంటూ సీరియస్ డైలాగుతో పవర్‌ఫుల్ పాత్రలో అనుష్క కనిపించారు. అనుష్క లీడ్ రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఒడిశా నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'ఘాటి' సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. చాలా గ్యాప్ తర్వాత అనుష్క నటిస్తున్న సినిమా కావడంతో.. మొదటి నుంచి 'ఘాటి'పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, టీ-జర్, -ట్రైలర్.. అనుష్క చేయబోయే విధ్వంసానికి శాంపిల్‌గా ఉండగా.. లే-టె-స్ట్‌గా ప్రభాస్ చేతుల మీదుగా విడుదల అయిన రిలీజ్ -ట్రైలర్ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లేలా ఉంది. ఈ రిలీజ్ -ట్రైలర్‌ను సోషల్ మీడియా ఖాతా ద్వారా రిలీజ్ చేశాడు డార్లింగ్. ఇక ఈ రిలీజ్ ట్రైలర్ మాత్రం అదిరిపోయిందనే చెప్పాలి. అనుష్క చేయబోయే ఊచకోతకు గూస్‌బంప్స్ గ్యారెంటీ అనేలా ఉంది. స్వీటీ- చేసిన యాక్షన్ సినిమాకే హైలెట్‌గా నిలిచేలా ఉంది. సూపర్బ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో సాగిన రిలీజ్ -ట్రైలర్‌లో అనుష్క పర్ఫామెన్స్ మామూలుగా లేదు. శీలావతిగా ఆమె చేసిన పోరాట సన్నివేశాలు -ట్రైలర్‌లో హైలెట్‌గా నిలిచాయి. ఈసారి దర్శకుడు క్రిష్ ఊహించని యాక్షన్ ఎలిమెంట్స్‌తో అనుష్కతో ఊచకోత చేయించినట్టు-గా ఉంది. అనుష్క ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ముందే రానని చెప్పినప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా ప్రమోట్ చేస్తున్నారు. ఇప్పటికే రానాతో ఫోన్ కాల్‌లో మాట్లాడిన స్వీటికి ఇప్పుడు ప్రభాస్ రిలీజ్ -ట్రైలర్ లాంచ్ చేయడం సినిమాకు మంచి బజ్ జనరేట్ అయ్యేలా చేసింది. దీంతో.. ఘాటి రాక కోసం ఎదురు చూస్తున్నారు అభిమానులు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం థియేటర్లోకి రానుండగా.. ఇంకొన్ని గంటల్లో తెరపై శీలావతి ఊచకోతను చూడబోతున్నాం.




## అల్లరి నరేశ్ ..
# ఆల్కహాల్ టీజర్ విడుదల

**టాకీస్:** అల్లరి నరేశ్ నటిస్తున్న తాజా సినిమా ఆల్కహాల్ . రుహానీ శర్మ కథానాయిక. మెహర్ తేజ్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. వచ్చే ఏడాది జనవరి 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సత్య, నిహారిక ఎన్ఎమ్ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేసే, ఒక గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. 'ఆల్కహాల్' చిత్రం ఒక ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామా అని తెలిపేలా టీ-జర్ ను అద్భుతంగా రూపొందించారు. మద్యం కథానాయకుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, తాగడానికి ముందు మరియు తాగిన తరువాత అతని ప్రవర్తన, మరియు దాని చుట్టూ జరిగే సంఘటనల సమాహారాన్ని ఈ టీ-జర్ సూచిస్తుంది. హాస్యం మాత్రమే కాకుండా, నవరసాలను అద్భుతంగా పలికించగల నటు-డిగా పేరుగాంచిన అల్లరి నరేష్, 'ఆల్కహాల్' రూపంలో మరో వైవిధ్యమైన చిత్రాన్ని అందించబోతున్నారు. ఇందులో సత్య సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. ఈ సినిమాతో నరేష్, పూర్తిగా కొత్త మార్గంలో అడుగుపెడుతున్నట్లు-కనిపిస్తోంది. ఇది ప్రేక్షకులలో కాస్త క్యూరియాసిటీ-ని పెంచుతుందనే చెప్పాలి. సుహాస్ నటించిన 'ఫ్యామిలీ డ్రామా'తో విమర్శకుల ప్రశంసలతో పాటు-, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## అందాలతో ఆగం చేస్తున్న అనన్య..

**టాకీస్:** అందాల చిన్నది తెలుగు బ్యూటీ అనన్య నాగళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ అమ్మడు ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన గ్లామర్‌తో నెట్టింట సెగలు పుట్టిస్తుంటుంది. తాజాగా మరోసారి తన అందంతో కుర్రకారుకు బాణాలు విసిరింది. మల్లేశం సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ, మొదటి సినిమాతోనే తన అందం, నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచుకుంది. దీంతో ఈ అమ్మడుకు మంచి గుర్తింపు లభించింది. ఇక ఈ మూవీ తర్వాత ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలోనే ఛాన్స్ కొట్టేసింది ఈ ముద్దుగుమ్మ. పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసి, అందులో ఓ అమాయకపు అమ్మాయి పాత్రలో నటించి, తన నటనతో ఎంతో మదిని ఆకట్టుకుంది. ఏ మూవీతో రానీ క్రేజ్ ఈ అమ్మడుకు వకీల్ సాబ్‌తో వచ్చిందని చెప్పవచ్చు. ఇక ఈ మూవీ తర్వాత అనన్య లైఫ్



టర్న్ అయ్యిందనే చెప్పాలి. ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళ్తుంది. ప్రస్తుతం ఈ చిన్నది పలు సినిమాల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఇక సినిమాల విషయం ఎలా ఉన్నా, ఈ బ్యూటీ మాత్రం సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది.వరస ఫొటో షూట్ తో కుర్రకారు మనసు దోచేస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్ స్టాలో క్రేజీ ఫొటోస్ షేర్ చేసింది. అందులో ఈ చిన్నది, బ్రౌన్ టాప్, బ్లాక్ జీన్స్ ధరించి అదిరిపోయే స్టిల్స్ ఇచ్చింది. చెట్ల మధ్య క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ ఉన్న ఈ ఫొటోస్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి.





# పరమ్ సుందరిలో జాన్వీ కపూర్
## విమర్శలపై క్లారిటీ ఇచ్చిన పవిత్రామీనన్

టాకీస్: జాన్వీ కపూర్ నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి'. ఈ సినిమాలో జాన్వీని తీసుకోవడంపై పలు విమర్శలు ఎదురైన సంగతి తెలిసిందే. ఉత్తరాదికి చెందిన ఆమెను మలయాళ యువతిగా చూపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. కేరళ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నటించేందుకు మలయాళ హీరోయిన్స్ లేరా? అంటూ గాయని పవిత్రా మేనన్ ఓ వీడియో విడుదల చేయగా అది చర్చనీయాంశమైంది. తాజాగా ఆమె దీనిపై స్పష్టతనిచ్చారు. నేను నటిని కాదు.. గాయనిని.. జాన్వీకి వ్యతిరేకంగా ఒక మలయాళ నటి విమర్శలు చేసింది అనే వార్తల్లో నిజం లేదు. నేను చెప్పింది పూర్తిగా భిన్నమైన అంశం. ఇది వృత్తిపరమైన అసూయ కాదు. నిజాయితీగా చెప్పాలంటే నేను వేరొకరి నోటి దగ్గర తిండిని లాగేసుకొనే ప్రయత్నం చేయలేదు. నేను భాష గురించి మాత్రమే మాట్లాడాను. మరొక ప్రాంతానికి చెందిన వారు మలయాళం సరిగ్గా మాట్లాడలేరని చెప్పానంతే. జాన్వీ ఆ పాత్రకు న్యాయం చేసింది. నేను ఆమెను రెండుసార్లు కలిశాను. ఆమె వ్యక్తిగతంగానూ తెలుసు. సినీ ఇండస్ట్రీలో ఏ ప్రాంతం నుంచైనా నటీనటులను ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే ఇతర ప్రాంతాల నుంచి తీసుకున్నప్పుడు వారికి మన భాషను నేర్పించడానికి కోచ్‌ను నియమించుకోవాలి. అలా నియమించడం వల్ల నష్టం లేదు కదా..' అని చెప్పారు. ఇక ఈ వివాదంపై జాన్వీకపూర్ గతంలోనే స్పందించిన విషయం తెలిసిందే. 'నేను మలయాళ అమ్మాయిని కాదు. మా అమ్మ (శ్రీదేవి) కూడా మలయాళీ కాదు. కానీ, కేరళ సంస్కృతిపై నేనెప్పుడూ ఆసక్తి చూపిస్తా. ముఖ్యంగా మలయాళ సినిమాలకు నేను అభిమానిని. 'పరమ్ సుందరి'లో నేను మలయాళ అమ్మాయిగానే కాదు తమిళ అమ్మాయిగానూ కనిపిస్తా' అని తెలిపారు. కేరళ యువతి, ఢిల్లీ యువకుడి ప్రేమకథే ఈ 'పరమ్ సుందరి'. సిద్ధార్థ్ మల్హోత్రా హీరో. ఈ సినిమా ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకువచ్చింది.



# ఆంధ్రాకింగ్ తాలూకా...రామ్



**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని హీరోగా నటిస్తోన్నతాజా ప్రాజెక్ట్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన -టైటిల్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 28న విడుదల చేస్తున్నట్టు- ఇప్పటికే ప్రకటించారు. కాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ పప్పీ షేమ్ లాంచ్ అప్‌డేట్ అందించారు. ఈ పాటను సెప్టెంబర్ 8న లాంచ్ చేయబోతున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో శ్రద్ధా శ్రీనాథ్ కొత్త వెబ్ సిరీస్..

**టాకీస్:** శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్. ఈ సిరీస్‌కు రాజేష్ ఎం. సెల్వా దర్శకత్వం వహిస్తుండగా.. సంతోష్ ప్రతాప్, చాందిని, శ్యామ హరిణి, బాలా హసన్, సుభాష్ సెల్వం, వివియా సంత, ధీరజ్, మరియు హేమ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్ నిర్మిస్తుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం ప్రకటించింది. ఈ వెబ్ సిరీస్ అక్టోబర్ 2, 2025 నుంచి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సిరీస్ ఒక గేమ్ డెవలపర్ జీవితం చుట్టూ తిరుగుతుంది. శ్రద్ధా శ్రీనాథ్ పోషించిన ఈ పాత్ర తనపై జరిగిన ఒక సామూహిక దాడి వెనుక ఉన్నవారిని కనిపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఆమెకు డిజిటల్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను, రహస్యాలను ఈ థ్రిల్లర్ సిరీస్ చూపిస్తుంది. ఈ సిరీస్ థ్రిల్లర్‌గా మాత్రమే కాకుండా, మనం నివసించే డిజిటల్ ప్రపంచం, రహస్యాలు, మరియు మారుతున్న సంబంధాలను కూడా ప్రతిబింబిస్తుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.